నమస్తే తెలంగాణ

నల్లగొండ

5 | నల్లగొండ, మంగళవారం 17 సెప్టెంబర్ 2024 | NALGONDA




నల్లగొండలో ఒకటో నంబర్ విగ్రహం వద్ద పూజలు చేస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, చిత్రంలో కలెక్టర్ నారాయణరెడ్డి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి



సూర్యాపేటలో ట్రాక్టర్ నడిపి శోభాయాత్రను ప్రారంభించిన మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

# ఓ బొజ్జ గణపయ్యా.. వెళ్లి రావయ్యా!

## లంబోదరుడికి ఘనంగా వీడ్కోలు

**ఉమ్మడి జిల్లావ్యాప్తంగా అట్టహాసంగా శోభాయాత్రలు**

**నల్లగొండలో ఒకటో నంబర్ విగ్రహం వద్ద మంత్రి కోమటిరెడ్డి పూజలు**

**సూర్యాపేటలో ట్రాక్టర్ తోలి శోభాయాత్రలో పాల్గొన్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి**

**అడుగడుగునా పోలీస్ నిఘా..నల్లగొండలో రూ.13.50 లక్షలు పలికిన లడ్డూ**

రామగిరి, సెప్టెంబర్ 16 : ఎటుచూసినా చూసినా ఉత్సవ శోభ.. ఎక్కడ విన్నా గణపతి నామస్మరణ.. కోలాటాలు.. డీజే పాటలు.. బ్యాండ్ చప్పుళ్లు.. తీన్మార్ స్టెప్పుల నడుమ లంబోధరుడిని నిమజ్జన శోభాయాత్రలు అట్టహాసంగా సాగాయి. నవరాత్రులు ఘనంగా పూజలు అందుకున్న గణనాధులను సోమవారం ప్రత్యేకంగా అలంకరించి వాహనాలపై భక్తిశ్రద్ధలతో తరలించి గంగమ్మ ఒడికి చేర్చారు. నల్లగొండ, సూర్యాపేట, మిర్యాలగూడ, భువనగిరి వంటి పట్టణాల్లో శోభాయాత్ర సంబురం అంబరాన్నంటింది. గల్లీ గల్లీ జై గణేశ్ మహారాజ్‌కీజై నినాదాలతో హోరెత్తాయి. నల్లగొండ పట్టణంలోని పాతబస్తీ హనుమాన్‌నగర్‌లో ఏర్పాటుచేసిన ఒకటో నెంబర్ గణపయ్య విగ్రహం వద్ద రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేసి శోభాయాత్రను ప్రారంభించారు. ఇక్కడ లడ్డూను బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి రూ.13.50 లక్షలకు దక్కించుకున్నారు. గతేడాది ఈ మండపం వద్ద లడ్డూ రూ.36లక్షలు పలికింది. నల్లగొండ జిల్లాకేంద్రంలో శోభాయాత్రలు ఉదయం ప్రారంభం కాగా, సాయంత్రానికి ఒక్కో విగ్రహం క్లాక్‌టవర్ సెంటర్‌కు చేరువడంతో అక్కడంతా ఉత్సవ వాతావరణం నెలకొంది. గణనాథులను చూసేందుకు తరలివచ్చిన భక్తులతో పరిసరాలన్నీ కిక్కిరిసిపోయాయి. ఒకటో నెంబర్ విగ్రహం మంత్రితోపాటు కలెక్టర్ సి.నారాయణరెడ్డి, ఎస్పీ శరత్ చంద్రపవార్, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కర్నాటి విజయ్‌కుమార్, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి పూజల్లో పాల్గొన్నారు. శోభయాత్ర ప్రారంభానికి ముందు జరిగిన సభలో ప్రముఖ వక్త అప్పల ప్రసాద్ వినాయక విశిష్టతను వివరించగా.. ఈ వేడుకల్లో ముస్లిం మత పెద్దలు కూడా పాల్గొనడం విశేషం. నల్లగొండ పట్టణంలో మొత్తం 750కిపైగా విగ్రహాలు నిమజ్జనానికి తరలాయి. శ్రీనగర్‌కాలనీలో ఏర్పాటుచేసిన 25 ఫీట్ల విగ్రహం, సావర్కర్‌నగర్ రోడ్డు నెం.1, విద్యానగర్‌లో పెట్టిన 26 అడుగుల విగ్రహాలను శోభాయాత్రలు అత్యంత వైభవంగా సాగాయి. వీటికాలనీలోని పంచముఖ హనుమాన్ దేవాలయంలోని మట్టి వినాయకుడి నిమజ్జనోత్సవానికి మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి పూజలు చేసి ప్రారంభించారు.



నల్లగొండ క్లాక్ టవర్ సెంటర్‌లో గణనాథుల శోభాయాత్ర



సూర్యాపేట సద్దుల చెరువులో నిమజ్జనం..



నాగార్జునసాగర్ వినాయక నిమజ్జనం



## గంగా జమునా తెహజీబ్ సంస్కృతికి మారుపేరు సూర్యాపేట

- **కులమతాలకు అతీతంగా పండుగలు**
- **మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి**

బొడ్రాయిబజార్, సెప్టెంబర్ 16 : అన్ని మతాలు, కులాల వాళ్లు కలిసి పండుగలు చేసుకుంటూ సూర్యాపేటను గంగా జమునా తెహజీబ్ సంస్కృతికి ప్రతీకగా నిలుపుతున్నారని మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. సూర్యాపేట జిల్లాకేంద్రంలోని వేదాంత భజన మందిరంలో ఏర్పాటుచేసిన మట్టి గణపతి విగ్రహానికి మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డితో కలిసి ఆయన ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ పట్టణంలో చాలావరకు గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో ముస్లింలు పాల్గొన్నారన్నారు. పట్టణ చరిత్రలో ఇప్పటి వరకు అవాంఛనీయ సంఘటనలేవీ జరుగకుండా గణేశ్ ఉత్సవాలను నిర్వహించుకోవడం అభినందనీయమన్నారు. ఎప్పటిలాగే అన్ని రాజకీయ పార్టీలు కలిసి వచ్చి వేడుకలు నిర్వహించడం మంచి విషయమన్నారు. సూర్యాపేట బొడ్రాయి పునఃప్రతిష్ట విషయంలో అన్ని వర్గాల ప్రజలు, రాజకీయ పార్టీల అభిప్రాయాలు తీసుకొని ముందుకు సాగాలన్నారు. గణేశ్ నవరాత్రులు ప్రశాంత వాతావరణంలో, భక్తి శ్రద్ధలతో జరిగేందుకు కృషి చేసిన ఉత్సవ కమిటీలకు శుభాకాంక్షలు తెలిపారు.

## నిమజ్జన ప్రాంతాలను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ

నల్లగొండ జిల్లాకేంద్రంలోని వల్లభరావు చెరువు, 14వ మైలురాయి, నాగార్జునసాగర్ బిడ్జి గణేశ్ విగ్రహ నిమజ్జనాలను వద్ద కలెక్టర్ సి.నారాయణరెడ్డి, ఎస్పీ శరత్‌చంద్రపవార్ పర్యవేక్షించారు. అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. నల్లగొండలో ఏర్పాటుచేసిన చిన్న విగ్రహాలను వల్లభరావు చెరువు, పెద్ద విగ్రహాలను 14వ మైలురాయి, నాగార్జునసాగర్‌కు తరలించారు. మరికొన్ని ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన విగ్రహాలను ఉదయమే శ్రీశైలం, భద్రాచలం, వాడపల్లి ప్రాంతాలకు తీసుకువెళ్లారు. నల్లగొండ పట్టణంలో ఎస్పీ పర్యవేక్షణలో 650 మంది పోలీసులు బందోబస్తు విధుల్లో పాల్గొన్నారు. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా జాగ్రత్తలు తీసుకుని సక్సెస్ అయ్యారు. నిమజ్జన ప్రదేశాల్లో అధికారులు ప్రత్యేక క్రేన్లు, లైటింగ్ ఏర్పాటు చేశారు. పోలీస్, రెవెన్యూ, మున్సిపల్‌తోపాటు వివిధ శాఖల అధికారులు, సిబ్బంది విధుల్లో పాల్గొన్నారు.



గణనాథుడిని నిమజ్జనానికి తీసుకువస్తున్న సూర్యాపేట కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



సూర్యాపేట ట్యాంక్‌బండ్‌పై వినాయక నిమజ్జనం




నల్లగొండ వల్లభరావు చెరువులో..

## మతసామరస్యానికి ప్రతీక నల్లగొండ

**మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి**

రామగిరి, సెప్టెంబర్ 16 : మతం కంటే మానవత్వం ముఖ్యమని, మత సామరస్యానికి నల్లగొండ ప్రతీకగా నిలుస్తుందని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. పాతబస్తీ హనుమాన్‌నగర్‌లోని ఒకటో నెంబర్ గణేశ్ విగ్రహం వద్ద ఆయన పూజలు చేసి శోభయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత 30 సంవత్సరాల్లో ఉత్సవాల వేళ జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలూ చోటుచేసుకోకపోవడం ఇక్కడి ప్రజల్లోని సోదరభావానికి నిదర్శనమన్నారు. వినాయక నిమజ్జనాన్ని ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలన్నారు. నల్లగొండ జిల్లాను రాష్ట్రంలోనే మోడల్ జిల్లాగా తీర్చిదిద్దేందుకు తన వంతు కృషి చేస్తున్నట్లు తెలిపారు. రూ.2వేల కోట్లతో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిని 6లైన్లకు విస్తరించే పనులకు త్వరలోనే కేంద్ర మంత్రి గడ్కరీతో శంకుస్థాపన చేయించనున్నట్లు చెప్పారు.





నల్లగొండ శివాజీ నగర్‌లో యువకుల సందడి



నల్లగొండ గంధవారిగూడెం రోడ్డులో మహిళల కోలాటం



సూర్యాపేటలో..



# సాగర్ తొణికిసలాడుతున్నా సాగునీటి జాడేది?

- **డీ 40 కాల్వ కింద ఎండుతున్న పంటలు**
- **నాలుగు మండలాల పరిధిలో అవస్థలు**
- **సాగునీటి విడుదల కోసం రోడ్డెక్కిన రైతాంగం**

తిప్పర్తి, సెప్టెంబర్ 15 : నాగార్జునసాగర్ నిండుకండలా తొణికిసలాడుతున్నా ఏఎమ్మార్పీ పరిధిలోని రైతులకు సాగు నీరు అందడం లేదు. అధికారుల నిర్వహణ లోపం డీ-40 కాల్వ ఆయకట్టు రైతులకు శాపంగా మారింది. మొదట కాల్వకు నీళ్లు ఇచ్చినా గండ్లు, ఏపుగా పెరిగిన కంపచెట్ల కారణంగా పంటలకు సాగు నీరు అంద లేదు. గండ్లు పూడ్చేందుకు వారం కింద నీటి విడుదల ఆపేసిన అధికారులు, ఆ తర్వాత పుట్టంగండి వద్ద మోటార్ రిపేర్ అయ్యిందని తిరిగి పునరుద్ధరించకపోవడంతో పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొంది. దాంతో ఐదు మండలాల రైతులు అవస్థలు పడుతున్నారు.

డీ-40 కాల్వ కింద మొత్తం 27,100 ఎకరాల ఆయకట్టుకుగానూ కుడివైపు తొమ్మిది, ఎడమ వైపు పది సబ్ కెనాల్స్ ఉన్నాయి. ఇది కట్టంగూర్ మండలం బొల్లెపల్లి నుంచి మాడ్గులపల్లి మండలం సీత్యాతండా వరకు 22.8 కిలోమీటర్ల వరకు విస్తరించి ఉంది. ఈ కాల్వల ద్వారా కట్టంగూరు, తిప్పర్తి మండలంతోపాటు మాడుగులపల్లి, వేములపల్లి మండలాల రైతులు తమ పొలాలు సాగు చేసుకుంటున్నారు. ప్రారంభంలో రైతులు పెట్టే అక్రమ గండ్ల కారణంగా చివరనున్న రైతులకు సాగు నీరు అందలేదు. మరోవపు కాల్వలకు మరమ్మతులు చేపట్టకపోవడంతో కంప చెట్లు కాల్వ నిండిపోయాయి. దాంతో కాల్వ పొంగి తరుచూ గండ్లు పడడం జరిగింది. ఇటీవల తిప్పర్తి మండలంలోని ఇండ్లూరు-వెంకటాద్రిపాలెం వద్ద ఈ కాల్వకు గండి పడటంతో సమీప రైతుల పంటలు మునిగాయి. దీన్ని పూడ్చడానికి అధికారులు నానా యాతన పడాల్సి వచ్చింది. డీ 40 కాల్వకు నీళ్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సోమవారం తిప్పర్తి మండలంలోని పలు గ్రామాల రైతులు సోమవారం ఆందోళనకు దిగారు. వానకాలం సీజన్ ముగిసే దశకు వచ్చినా నేటికీ కాల్వకు నీరు విడుదల చేయకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్పందించి వెంటనే నీటిని విడుదల చేయించాలని డిమాండ్ చేశారు.



డీ-40 కాల్వ పరిస్థితి



డీ40 కాల్వ వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

### వారబందీగా నీళ్లు వదులుతున్నాం



మోటర్లు రిపేరు వల్ల ప్రారంభంలో నీళ్లు రాలేదు. మోటర్ రిపేరు అయిన తర్వాత పూర్తిగా నీళ్లు వస్తున్నాయ్. ఏఎమ్మార్పీకి వారం బందీ పద్ధతితో నీళ్లు వదులుతున్నాం. ప్రస్తుతం సగం వరకే నీళ్లిచ్చాం. మరో దశలో కాల్వ చివరి వరకు నీళ్లు ఇస్తాం. అక్కడక్కడ రైతులు పెట్టిన అక్రమ గండ్లను గుర్తించి తొలగించాం. సిబ్బందితో ఎప్పుడికప్పుడు పర్యవేక్షణ చేయిస్తున్నాం. రైతులకు ఇబ్బంది లేకుండా కింది వరకు సాగు నీరు అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నాం.

**- సురేందర్ రావు, ఈఈ, ఇరిగేషన్ శాఖ**

### తూకం మడి కూడా పారుతలేదు



నాకు మూడెకరాల భూమి ఉంది. బీఆర్ఎస్ ప్రభుత్వంలో కాల్వ మంచిగ పారింది. నా చెల్క మొత్తం అచ్చుగట్టిన. ఎనిమిదేండ్లు వడ్లు పండినయి. ఈ ఏడు మొన్న యాసంగిలో కాల్వ రాక బోరు కూడా పొయ్యలేదు. ఇప్పుడు సాగర్‌లో నీళ్లు ఉన్నా ఇవ్వడం లేదు. అప్పడప్పుడు గిన్ని గిన్ని వస్తే కనీసం తూకం మడి కూడా పారుతలేదు. కాల్వ వస్తుందని ఇంకో మడి దున్నితే అప్పుడే కాల్వ పోయింది. మళ్లీ ఎప్పుడొస్తుందో ఏమో. నిన్నమొన్న వర్షాలొచ్చి కొంత మేలు అయ్యింది. తొందరగా కాల్వకు నీళ్లిచ్చి ఆదుకోవాలి.

**- కొమ్మనబోయిన నర్సయ్య, రైతు, సర్వారం, తిప్పర్తి మండలం**

### నీళ్ల కోసం గతంలో ఇంత ఇబ్బంది పడలేదు



నాకు 10ఎకరాల భూమి ఉంది. కాల్వకు నీళ్లు రాక ఇబ్బందులు పడుతున్నాం. ఉన్న బోర్లు సరిగా పోయక మూడు ఎకరాలే నాటు పెట్టిన. అది కూడా కొసెల్తెదో లేదో అన్నట్టుంది. చాలామంది రైతులు భూములు పడావు బెట్టుకుండ్రు. నీళ్ల కోసం గతంలో ఇంతగానం ఇబ్బంది పడలేదు. ముందున్న రైతులు కొందరు కాల్వకు గండికొట్టి గూనలు వేసుకుండ్రు. అధికారులు వాటిని తీయించాలి.

**- చెదురుపల్లి భిక్షం, సిలార్మియాగూడెం, తిప్పర్తి మండలం**

# ప్రజా పాలన దినోత్సవానికి సర్వం సిద్ధం

- **పరేడ్ గ్రౌండ్‌లో వేడుకలు.. జెండా ఆవిష్కరించనున్న మంత్రి కోమటిరెడ్డి**
- **సూర్యాపేటలో పాల్గొననున్న బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్**



నల్లగొండ పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాట్లు

నల్లగొండ, సెప్టెంబర్ 16: సెప్టెంబర్ 17ను పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజా పాలన దినోత్సవానికి జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. నల్లగొండ జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించనున్న వేడుకలకు రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. మంగళవారం ఉదయం పది గంటలకు జెండావిష్కరణ చేసి పోలీసుల గౌరవ వందనం స్వీకరించనున్నారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై మంత్రి ప్రసంగిస్తారు. ఈ సందర్భంగా విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేశారు. వేడుకల్లో కలెక్టర్ నారాయణరెడ్డి, ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఇతర ప్రజాప్రతినిదులు, అధికారులు పాల్గొననున్నారు. ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామపంచాయతీల్లో జాతీయ జెండా విష్కరణ చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

**సూర్యాపేటలో..**

సూర్యాపేట, సెప్టెంబర్ 16 : తెలంగాణ ప్రజాపాలన దినోత్సవానికి సూర్యాపేట కలెక్టరేట్ ముస్తాబైంది. మంగళవారం ఉదయం 9 గంటలకు వేడుకలు ప్రారంభం కానున్నాయి. తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ ముఖ్యఅతిథిగా హాజరై 9.50 గంటలకు తెలంగాణ అమరులకు పుష్పాంజలి ఘటించనున్నారు. 10 గంటలకు జాతీయ పతాకావిష్కరణ చేశారు. అనంతరం ప్రసంగిస్తారు. 10.30 గంటలకు సంస్కృతిక కార్యక్రమాలు, 11 గంటలకు వివిధ శాఖల స్టాల్స్ ప్రదర్శన ఉంటాయి. 11.30 గంటలకు కార్యక్రమం ముగింపు ఉండనున్నది. వేడుకల్లో కలెక్టర్, ఎస్పీ పాల్గొననున్నారు.

# 'ఇన్‌స్పైర్-మనక్'కు పెరిగిన నామినేషన్లు

- **మూడు రోజుల్లోనే 264**
- **అక్టోబర్ 20 వరకు గడువు పెంచిన ప్రభుత్వం**

రామగిరి, సెప్టెంబర్ 16: పాఠశాల విద్యార్థుల్లో శాస్త్రీయ నైపుణ్యాన్ని పెంచేందుకు నిర్వహించే 'ఇన్‌స్పైర్-మనక్' నామినేషన్లు(దరఖాస్తులు) భారీగా పెరిగాయి. నామినేషన్స్ తక్కువగా వస్తున్న విషయమై 'ఏదీ ఇన్‌స్పైర్' అనే శీర్షికన నమస్తే తెలంగాణలో ఈ నెల 13న కథనం ప్రచురితమైంది. అప్పటి వరకు(ఈ నెల 13) జిల్లాలో 1,022 నామినేషన్స్ మాత్రమే వచ్చాయి. దాంతో స్పందించిన విద్యాశాఖ అధికారులు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను చైతన్యపర్చారు. దాంతో ఈ నెల 15వరకు మూడు రోజుల్లోనే 264 నామినేషన్స్ వేయగా.. జిల్లా వ్యాప్తంగా ఆదివారం రాత్రి నాటికి మొత్తం 1,286 నమోదైనట్లు జిల్లా సైన్స్ అధికారి వనం లక్ష్మీపతి వెల్లడించారు. దాంతో పాటు నామినేషన్స్ గడువు ఈ నెల 15తో ముగియగా దానిని అక్టోబర్ 20 వరకు పొడిగించినట్లు ఆయన తెలిపారు.